

- సీనియారిటీ రేసులో గద్దె రామ్మోహన్‌కు చాన్స్
- వైశ్య సామాజికవర్గం నుంచి శ్రీరాం తాతయ్య
- బీసీ కోటాలో కొల్లు రవీంద్ర.. కాపు కోటాలో బొండా ఉమా
- రేసులో గుడివాడ, గన్నవరం గేమ్ చేంజర్స్ రాము, యార్లగడ్డ
- బీజేపీ కోటాలో సుజనా పేరు, జనసేన నుంచి మండలి
- పెరుగుతున్న ఆశావహుల సంఖ్య

కూటమి కొలువులో

మంత్రులెవరు?

మంత్రివర్గ కూర్పుపై రెండు జిల్లాల్లో చర్చ

ఎన్నికలు ముగిశాయి.. ఫలితాలూ వచ్చాయి.. రెండు జిల్లాలనూ టీడీపీ కూటమి క్లీన్‌స్వీప్ చేసేసింది.. ఇక ఇప్పుడు అందరి చర్చ మంత్రివర్గ కూర్పుపైనే. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఎవరికి మంత్రి పదవి దక్కుతుందనే గుసగుసలు ఇప్పటికే మొదలవ్వగా, ఆశావహుల లిస్ట్ కూడా భారీగానే పెరిగిపోతోంది. ఈనెల 12న చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఎవరికి మంత్రి పదవి వస్తుందనే సందిగ్ధం ఏర్పడింది.


గద్దె రామ్మోహన్


కొల్లు రవీంద్ర


బుద్ధప్రసాద్ (జనసేన)


శ్రీరాం తాతయ్య


సుజనా చౌదరి (బీజేపీ)


బొండా ఉమా


యార్లగడ్డ వెంకట్రావు


వెనిగండ్ల రాము

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఈనెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇక చంద్రబాబు కేబినెట్‌లో మంత్రులుగా ఎవరు ఉండబోతున్నారనే చర్చ ప్రస్తుతం రెండు జిల్లాల్లో జోరుగా సాగుతోంది. రెండు జిల్లాలనూ కూటమి అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేయడంతో ఈసారి ఆశావహుల జాబితా చాలా పెద్దగానే ఉంది. ఇక్కడి నుంచి బీజేపీ, జనసేన నుంచి హేమాహేమీలు ఉన్నారు. విజయవాడ పశ్చిమ నుంచి బీజేపీ అభ్యర్థిగా గెలుపొందిన సుజనా చౌదరి ఆ పార్టీ కోటాలో మంత్రి పదవి దక్కించుకోవచ్చని చెబుతున్నారు. అయితే, ఉమ్మడి కృష్ణాను ప్రాతిపదికన తీసుకుంటే ఆయనకు మరో బీజేపీ నేత కామినేని శ్రీనివాస్ నుంచి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. కృష్ణాజిల్లా నుంచి జనసేన తరఫున గెలుపొందిన మండలి బుద్ధప్రసాద్‌కు ఆ పార్టీ కోటాలో మంత్రి పదవి దక్కవచ్చని ఆయన అనుచరులు అంచనా వేస్తున్నారు.

టీడీపీ జాబితా పెద్దదే..

రెండు జిల్లాల నుంచి టీడీపీ నుంచి మంత్రి పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య చాలా పెద్దదే. వైశ్య సామాజికవర్గం నుంచి రాష్ట్రంలో ఇద్దరే గెలుపొందారు. వీరిలో సీనియారిటీపరంగా జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముందు వరుసలో ఉంటారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన పార్టీకి విధేయుడిగా గుర్తింపు పొందారు. ఈ ఎన్నికల్లో వైశ్య సామాజికవర్గాన్ని టీడీపీ వైపు మళ్లించడంలో ఆయన కృషి చాలానే ఉంది. దీంతో ఆయనకు మంత్రి పదవి దక్కవచ్చని ఆయన అనుచరులు భావిస్తున్నారు. బీసీ సామాజికవర్గం నుంచి మాజీ మంత్రి, మచిలీపట్నం నుంచి గెలుపొందిన కొల్లు రవీంద్ర రేసులో ఉన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాను పరిగణనలోకి తీసుకునే పక్షంలో నూజివీడు నుంచి గెలుపొందిన కొలుసు పార్థసారథి ఆయనకు పోటీగా నిలిచే అవకాశం ఉంది. కాపు సామాజికవర్గం నుంచి విజయవాడ సెంట్రల్ నుంచి గెలుపొందిన బొండా ఉమా రేసులో ఉన్నారు. కమ్మ సామాజికవర్గం నుంచి విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా గెలుపొందిన గద్దె రామ్మోహన్, గుడివాడ, గన్నవరం నుంచి వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు రేసులో ఉన్నారు. సీనియారిటీని పరిగణనలోకి తీసుకుంటే ఒకసారి ఎంపీ, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన గద్దె రామ్మోహన్‌కు అవకాశాలు ఉన్నాయి. అదే సమయంలో కొడాలి నాని, వల్లభనేని వంశీ వంటి వారికి ఎదురొడ్డి, వారి అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొని, టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపిన వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు పేర్లు సైతం మంత్రి పదవుల రేసులో వినిపిస్తున్నాయి.


ఉంగుటూరు వద్ద బుడమేరుపై అసంపూర్తిగా నూతన బ్రిడ్జి పిల్లర్లు

వంతెన.. ఇక ఇంతేనా?

- ఉంగుటూరు వద్ద బుడమేరుపై పూర్తికాని బ్రిడ్జి నిర్మాణం
- బిల్లులు చెల్లించకపోవడంతో అసంపూర్తిగానే..

ఉంగుటూరు, జూన్ 6 : తేలప్రోలు-ఉయ్యూరు ప్రధాన రహదారిపై ఉంగుటూరు వద్ద బుడమేరుపై చేపట్టిన నూతన బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. పాలకుల నిర్లక్ష్యం, పూర్తిచేసిన పనులకు బిల్లులు చెల్లించడంలో జాప్యం కారణంగా నిర్మాణ పనులను నిలుపుదల చేశారు. పాతవంతెనల స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి 2018లో అప్పటి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. రూ.24 కోట్ల సీఆర్ఎఫ్ నిధులతో 270 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు, 9 మీటర్ల ఎత్తులో ఉంగుటూరు-లంకపల్లి గ్రామాల మధ్య ఈ వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పడ్డ రాజకీయ పరిణామాలు, నిధుల మంజూరులో జాప్యం, కరోనా విపత్కర పరిస్థితుల కారణంగా పనులు ప్రారంభం కాలేదు. 2022లో సుమారు రూ.6 కోట్లు వెచ్చించి పునాదులు, పిల్లర్ల నిర్మాణం పూర్తిచేశారు. ఆ తర్వాత బిల్లులు రాకపోవడంతో పనులు నిలుపుదల చేశారు.

ఎన్నికలకో నియోజకవర్గం.. దక్కని ఫలితం!



- పెనమలూరులో చెల్లని జోగి జిమ్మిక్కులు
- వచ్చీరాగానే విచ్చలవిడి అక్రమాలు.. దందాలు..
- ఘోరంగా అవమానించిన నియోజకవర్గ ప్రజలు
- జిల్లాలోనే అత్యధిక ఓట్ల తేడాతో జోగి ఓటమి

ఆయన సొంత నియోజకవర్గం మైలవరం. అక్కడ పోటీ చేసి గెలిచేంత సత్తా ఆయనకు లేదు. ఆ విషయం 2014లో నియోజకవర్గ ప్రజలు కూడా తేల్చారు. అప్పటి నుంచి ఆయన ఎన్నికలకో నియోజకవర్గం మారుతూ పబ్బం గడుపుకొనే ప్రయత్నం చేస్తుంటారు. ఆయనే పెనమలూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగి ఘోర పరాజయం పాలైన మంత్రి జోగి రమేశ్. నియోజకవర్గ చరిత్రలోనే అత్యంత ఘోర ఓటమి చవిచూసిన ఘనత జోగి రమేశ్‌దే. టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ చేతిలో 59,915 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : యువజన కాంగ్రెస్ నాయకుడిగా జోగి రమేశ్ రాజకీయ జీవితం ప్రారంభమైంది. 2009లో సొంత నియోజకవర్గమైన మైలవరం టికెట్ ఆశించారు. అయితే వైఎస్సార్ ఆశీస్సులతో చివరికి పెడన నియోజకవర్గ టికెట్ సాధించగలిగారు. కాంగ్రెస్ హవాలో ఆయన అక్కడి నుంచి గెలుపొందారు. ఆ తర్వాత 2014లో సొంత నియోజకవర్గంలో అదృష్టం పరీక్షించుకుందామనుకుంటే నియోజకవర్గ ప్రజలు ఛీకొట్టారు. దీంతో 2019కి మళ్లీ పెడనకే వెళ్లారు. వైసీపీ గాలిలో గెలిచి మంత్రి కూడా అయ్యారు. పెడనలో 2019 నుంచి 2024 వరకు ఈయన చేసిన అరాచకాలతో అక్కడ గెలవలేడని నిర్ణయించుకున్న వైసీపీ అధిష్ఠానం ఆయనకు పెనమలూరు టికెట్ కేటాయించింది. పెనమలూరుకు రావడం రావడమే ఈయన అరాచకాలు మొదలు పెట్టారు. ఓవైపు పెడన మరోవైపు మైలవరం నియోజకవర్గాలతోపాటు పెనమలూరు నియోజకవర్గంలోనూ టార్గెట్లు పెట్టి మరీ కలెక్షన్లు మొదలుపెట్టారు. పెనమలూరు చెంతనే కృష్ణా నది ప్రవహిస్తుంటుంది. అక్కడి నుంచి ఇసుక తోలకానికి నెలవారీ టార్గెట్లు పెట్టి వసూళ్లు చేశారు. అనధికార కట్టడాలు.. లే అవుట్లు ఇలా కాదేదీ కలెక్షన్లకు అనర్హం అన్న రీతిలో ఈయన చేసిన దోపిడీతో పెనమలూరు వాసులు బెంబేలెత్తిపోయారు.

ఓటుతో అవమానించి వెళ్లగొట్టారు

పెనమలూరు నియోజకవర్గంలో మొత్తం 22 రౌండ్లలో ఓట్లు లెక్కించారు. తొలి రౌండులో జోగి రమేశ్‌కు 275 ఓట్ల ఆధిక్యం లభించింది. దీంతో టీడీపీ శ్రేణుల్లో కాస్త ఉత్కంఠ నెలకొంది. అయితే రెండో రౌండ్ నుంచి ఏకపక్షంగా సాగిన ఓట్ల లెక్కింపు టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. రెండో రౌండు నుంచి ప్రతి రౌండులోనూ బోడె ప్రసాద్‌కు ఓట్ల వర్షం కురిసింది. కొన్ని రౌండ్లలో టీడీపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లలో సగం కూడా జోగి రమేశ్‌కు రాకపోవడం గమనార్హం. ప్రతి రౌండులోనూ జోగి రమేశ్‌పై ఓటర్లలో గూడుకట్టుకున్న కసి కనిపించింది. దాని ఫలితమే 59,915 ఓట్ల మెజారిటీతో బోడె ప్రసాద్ గెలుపు. ఇది పెనమలూరు నియోజకవర్గ చరిత్రలోనూ రికార్డు. బోడె ప్రసాద్‌కు నియోజకవర్గ ప్రజల్లో 61.28 శాతం ఓటర్లు మద్దతు పలకగా జోగి రమేశ్‌కు 35.93 శాతం మందే మద్దతు పలికారు.

సొంత పార్టీ కార్యకర్తల్లోనే అపనమ్మకం

జోగి రమేశ్‌ను పెనమలూరు నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలే విశ్వసించలేదు. కేవలం కొందరు నాయకులు తమ పబ్బం గడుపుకొనేందుకు జోగి పంచన చేరారే తప్ప చాలా మంది ఆయనకు దూరంగా ఉండిపోయారు. పెడన నియోజకవర్గంలో సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలకు పదవులు.. పనులు చేయాలన్నా వారి నుంచీ కమీషన్లు గుంజడంతో జోగి రమేశ్‌ను పెనమలూరు నియోజకవర్గంలో సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు నమ్మలేదు. ఆయన్ను గెలిపిస్తే నియోజకవర్గంలో తిష్టవేసుకుని ఏకు మేకుగా మారుతాడన్న ఉద్దేశంతో చాలామంది ఆయన ఓడిపోవాలని ఆకాంక్షించారు. ఆయన్ను ఓటమిపాలు చేస్తే వచ్చే ఎన్నికల నాటికి మరో నియోజకవర్గం చూసుకుంటారన్న ఆలోచనతో సొంత పార్టీ నాయకులు ముందుచూపుతో పావులు కదిపారు. దీంతోపాటు నియోజకవర్గ ప్రజల్లో వెల్లువెత్తిన వ్యతిరేకత సునామీలా మారి జోగి రమేశ్‌ను మట్టికరిపించింది.

చంద్రబాబు ఇంటిపై దాడి ఘటనా మైనస్

మాజీ సీఎం చంద్రబాబు నివసిస్తున్న ఉండవల్లి కరకట్ట ఇంటిపై 2021 సెప్టెంబరు 17న జోగి రమేశ్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు దాడికి యత్నించారు. ఈ దాడిలో జోగి రమేశ్, ఆయన అనుచరులే కీలకంగా వ్యవహరించారు. జోగి అనుచరులైన పాలడుగు దుర్గాప్రసాద్, నల్లమోతు జాన్ (జోగి రమేశ్ తమ్ముడు రాము అనుచరుడు), మధుపల్లి ఆనంద్‌కుమార్, మేడపాటి నాగిరెడ్డి, ఆరేపల్లి రాము, నల్లమోతు మధు తదితరులతోపాటు జోగి తమ్ముడు రాము కూడా చంద్రబాబు ఇంటిపై దాడిలో ఉన్నారు. ఈ దాడి తర్వాతే జోగిని మంత్రి పదవి వరించింది. కానీ ఈ ఘటనతో ప్రజల్లో జోగి రమేశ్‌పై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. పెనమలూరు నియోజకవర్గం అసలే టీడీపీకి అనుకూల నియోజకవర్గం అలాంటి నియోజకవర్గంలో ఈ ఘటన ఇంకా ఎక్కువ ప్రభావం చూపింది. జోగి ఘోర పరాజయానికీ ఈ ఘటన కూడా ప్రధాన కారణంగా నిలిచింది.

మీ పార్టీలోకొస్తాం..

టీడీపీ ముఖ్య నేతలతో టచ్‌లోకి వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకత్వం

- ఐదేళ్లూ గుడివాడలో అరాచకం.. తప్పించుకునే ప్రయత్నం..
- టీడీపీలోకి రానీయకపోతే జనసేన లేదా బీజేపీలోకి..
- పార్టీ మారకపోతే బిల్లులు కూడా రావనే ఆందోళన
- వైసీపీ సర్పంచులూ టీడీపీలోకి వెళ్లే యోచన

వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకుల్లో భయం మొదలైంది. గత ఐదేళ్లలో చేసిన అక్రమాలు, అరాచకాల నుంచి తప్పించుకునేందుకు పార్టీ మారే యోచనలో ఉన్నారు. వచ్చే ఎన్నికల వరకూ వైసీపీ ఉంటుందో లేదోనని ఆందోళన కూడా వారిని వెంటాడుతోంది. తాము చేసిన కాంట్రాక్టులకు బిల్లులు రావనే ఆందోళన కూడా పార్టీ మారడానికి కారణమవుతోంది. గుడివాడ, పట్టణ, మండల నాయకులు కొందరు తమ ప్రయత్నాలను ఉధృతం చేశారు. అక్కడ కాదంటే బీజేపీలోకి వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు.



గుడివాడ : ఐదేళ్ల జగన్ పాలనలో గుడివాడ మున్సిపాలిటీలో అన్నివిధాలుగా దోచుకున్న వైసీపీ కాంట్రాక్టర్ ఒకరు బీజేపీలో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీలోకి వస్తే నాయకులతో పాటు కార్యకర్తలు ఒప్పుకోరనే కారణంతో బీజేపీలోకి వెళ్లాలని తండ్రి, కుమారులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసం కైకలూరు బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని అడ్డుపెట్టుకుని ఆ పార్టీలో చేరాలని ప్రయత్నిస్తున్నారు.

- **మరో నాయకుడు జనసేన వైపు**

ఐదేళ్లలో స్థానిక ఎమ్మెల్యే నాని, అతని ముఖ్య అనుచరుడు దుక్కిపాటి శశిభూషణ్ కార్యాలయాల్లో తన పనులు కాకుండా అడ్డుపడ్డారనే కోపంతో మరో వైసీపీ ముఖ్య నాయకుడు ఉన్నారు. ఐదేళ్ల పాటు తనను పూర్తిగా తొక్కేశారని ఆయన రగిలిపోతున్నారు. ఈ ఎన్నికల్లో నానికి తల్లో నాలుకగా వ్యవహరించాడు. ఐదేళ్లలో జనసేన అధినేత పవన్‌ను ఎమ్మెల్యే నాని నోటికి వచ్చినట్టు తిట్టడం నచ్చక సదరు నాయకుని కుటుంబసభ్యులు జనసేనలో చేరాలని ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం.

- **బిల్లుల కోసం పార్టీ మారేందుకు ఇంకొకరు..**

ఐదేళ్ల కాలంలో పంచాయతీ, మున్సిపాలిటీలో పలు పనులు చేపట్టి ఆర్థికంగా బాగానే స్థిరపడిన గుడివాడ మండలానికి చెందిన వైసీపీ నాయకుడు టీడీపీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నాడు. తాను చేసిన అక్రమాలు, అరాచకాల నుంచి తప్పించుకోవాలంటే ఆ పార్టీలో చేరడమే సరైన నిర్ణయమని నిర్ధారణకు వచ్చాడు. గతంలో మాజీ ఎమ్మెల్యే రావికి నమ్మినబంటుగా ఉన్న ఇతను నాని పంచన చేరి బాగానే పోగేసుకున్నాడు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ తరుపున పోటీ చేసేందుకు ఇంటిని సైతం అమ్మేసుకున్నాడు. అయితే ఐదేళ్లలో నాని అండతో ఆర్థికంగా స్థిరపడ్డాడు. మూడు అంతస్తుల భవనం నిర్మిస్తున్నట్టు సమాచారం. టీడీపీ కార్యకర్తపై పరోక్షంగా కేసులు పెట్టే విషయంలో ఇతను పూర్తిగా సహకరించాడని బాధితుడు పేర్కొంటున్నాడు. వైసీపీ రాష్ట్రంలో తుడిచిపెట్టుకుపోయి టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో గోడ దూకేందుకు వైసీపీ నాయకులు ఎవరికి వారే ఏదో ఒక దారిలో ఇతర పార్టీలో చేరేందుకు అన్నీ సిద్ధం చేసుకుంటున్నారు. అందుకోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

ఆ నాయకుడు పార్టీలోకి వద్దు..

స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని మాటే వేదంగా వ్యవహరించే మైనార్టీ నాయకుడొకరు తన మాతృ పార్టీ తెలుగుదేశంలోకి రావాలని శతవిధాలుగా కృషి చేస్తున్నాడు. ఎన్నికల పోలింగ్‌కు ముందే పలుమార్లు కబురు పంపినా టీడీపీ నాయకులు పట్టించుకోలేదు. దీంతో టీడీపీ మైనార్టీ నాయకుల ద్వారా పార్టీలో చేరేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. అసాంఘిక కార్యకలాపాలు, జగనన్న కాలనీలో ఒక మహిళ ద్వారా వడ్డీ వ్యాపారం, లేఅవుట్ చేశాక మిగిలిన చిన్నపాటి స్థలాలను అక్రమంగా అమ్మేసుకున్నాడనే ఆరోపణలున్నాయి. అధికార మార్పిడి జరగడంతో వైసీపీని వీడి టీడీపీలో చేరితే తను చేసిన అక్రమ ప్లాట్‌ల వ్యాపారం, పేకాట శిబిరాలకు ఎటువంటి ఆటంకమూ ఉండదనే ఆలోచనతో టీడీపీవైపు చూస్తున్నాడు. ఈ నాయకుడు మాకొద్దు అని టీడీపీ మైనార్టీ నాయకులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు.

సర్పంచ్‌ల చూపు కూటమి వైపు

సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని పలువురు వైసీపీ సర్పంచ్‌లు టీడీపీలో చేరాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఈ క్రమంలోనే పలువురు ఈ ఎన్నికల్లో వైసీపీకి పెద్దగా ప్రచారం చేసిందిలేదు. ఐదేళ్లలో గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కపైసా కూడా ఇవ్వలేదు. ఆర్థిక సంఘం నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బకాయిల పేరుతో దోచేసుకుంది. కచ్చితంగా కూటమి అధికారంలోకి వస్తుందని, పంచాయతీలకు నిధులొస్తాయని, దీంతో ఎంతోకొంత గ్రామాన్ని అభివృద్ధి చేయవచ్చనని, ఎన్నికల్లో పెట్టిన ఖర్చు అయినా రాబట్టుకోవాలనే ఆలోచనలో ఉన్నారు.

మెరక పేరుతో మేత

- బందరు మండలంలో 72 లే అవుట్‌లు
- వైసీపీ నాయకుల అవినీతికి పరాకాష్ట
- విచారణ చేసి అవినీతిని బయట పెడతామంటున్న టీడీపీ నాయకత్వం
- కరగ్రహారం 350 ఎకరాల్లోని లే అవుట్‌లోనూ ఇదే తంతు

అర మీటరు ఎత్తున మెరక చేసి... మీటరు ఎత్తున మెరక చేసినట్టుగా బిల్లులు

జగనన్న లే అవుట్‌ల మెరక పేరుతో వైసీపీ నాయకులు చేసిన అవినీతి, అక్రమాలపై విచారణకు టీడీపీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. బందరు మండలంలోని 72 లే అవుట్‌లలోనూ, జిల్లాలోనే అతి పెద్దదైన కరగ్రహారంలోని 350 ఎకరాల లేఅవుట్‌లో మెరక పేరుతో చేసిన అక్రమాలపై నిజాలు నిగ్గుదేల్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. మాజీమంత్రి పేర్ని నాని, ఆయన అనుచరుల కనుసన్నల్లో జరిగిన అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి.

-మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

మెరక కొంతే.. బిల్లు భారీగా..

బందరు మండలంలో పేదలకు ఇళ్లస్థలాల పేరుతో 72 జగనన్న లే అవుట్‌లు వేశారు. మాలకాయలంక, వాడపాలెం, వెంకటదుర్గాంబపురం, పోలాటితిప్ప, గిలకలదిండి, గరాలదిబ్బ, క్యాంప్‌బెల్‌పేట, బందరుకోట, ఉల్లింగిపాలెం, పల్లెతుమ్మలపాలెం తదితర ప్రాంతాల్లోని లే అవుట్‌లను సక్రమంగా మొరక చేయకుండానే మెరక చేసినట్టుగా చూపారు. మీటరు ఎత్తున పనులు చేయాల్సి ఉండగా అర మీటరు ఎత్తున మాత్రమే పనులుచేసి బిల్లులు చేసుకున్నారు. అన్ని లే అవుట్‌లకు కలిపి రూ.95 కోట్ల మేర బిల్లులు చేశారు.

కరగ్రహారం లేఅవుట్‌లో..

మచిలీపట్నం మండలం కరగ్రహారం సమీపంలో 350 ఎకరాల విస్తీర్ణంలో జగనన్న లే అవుట్ వేశారు. 16 వేల మంది లబ్ధిదారులకు ఇక్కడ ఒక్కొక్కరికి సెంటు భూమి చొప్పున ప్లాట్‌లు ఇచ్చారు. ఈ భూమిలో మెరక పనులు చేసేందుకు మహారాష్ట్రకు చెందిన ఓ కంపెనీ పేరుతో కాంట్రాక్టు తీసుకున్నారు. ఇక్కడ మెరక పనులు పూర్తిస్థాయిలో చేయకుండా మమ అనిపించారు. ఈ లేఅవుట్‌కు సమీపం లోనే సముద్రం పక్కనే బే ఆఫ్ బెంగాల్ భూముల్లో సహజసిద్ధంగా మేటవేసిన మట్టిగుట్టలను, ముడా భూముల నుంచి మట్టిని తీసుకువచ్చి పూర్తిస్థాయిలో మెరక చేసినట్టుగా చూపి బిల్లులు చేసుకున్నారు.

మెరక పనుల తీరుపై టీడీపీ నేతల ఫిర్యాదు

ఈ లేఅవుట్ పల్లపు ప్రాంతంలో ఉండటంతో కొద్దిపాటి వర్షానికే ఇక్కడ నీరు నిలబడిపోతోంది. గత వర్షాకాలంలో ఈ లే అవుట్‌లో నీరు నిలబడి పోవడంతో టీడీపీ నాయకులు ఇక్కడ ఈతకొట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణం ఎలా చేసుకోవాలని, ఈ లేఅవుట్‌లో మెరక పనులు సక్రమంగా చేయని తీరుపై పూర్తిస్థాయి విచారణ చేయాలని టీడీపీ నేతలు అప్పట్లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి చేయడంతో ఎలాంటి విచారణా చేపట్టకపోగా, బిల్లులు మాత్రం హడావుడిగా చేసేశారు. కరగ్రహారం లే అవుట్ మెరక పనులు ఎంతమేర చేశారు? బిల్లులు ఎంతచేశారు? తదితర అంశాలపై సమాచారహక్కు చట్టం ద్వారా టీడీపీ నాయకులు వివరాలు కోరారు. దీంతో ఈ లే అవుట్‌లో బందరుపోర్టు నిర్మాణంలో భాగంగా తవ్వేమట్టితో కొంతమేర మెరకచేసి సరిపెట్టారు.


కరగ్రహారం జగనన్న లే అవుట్‌లో అసంపూర్తిగా మెరక పనులు

ఇవిగో మరికొన్ని లే అవుట్లలో అక్రమాలు..

- గిలకలదిండిలోని 18 ఎకరాల్లోని జగనన్న లే అవుట్‌ను మాజీమంత్రి పేర్ని నాని అనుచరుడు నాబార్డు నిధులు రూ.5 కోట్లతో మెరక పనులు చేశాడు. అరమీటరు ఎత్తున కూడా మట్టిని వేయలేదు. కానీ మీటరు ఎత్తున మెరక చేసినట్టుగా బిల్లులు చేసుకున్నాడు.
- గిలకలదిండి లే అవుట్‌లో లబ్ధిదారులకు ఇవ్వకుండా రిజర్వులో ఉంచిన 40 ప్లాట్‌లను స్థానిక వైసీపీ నాయకులు ఒక్కోప్లాట్‌ను రూ.1.50 లక్షలకు విక్రయిస్తుండటం గమనార్హం. ప్లాట్‌లు విక్రయించిన ఒక ప్రజాప్రతినిధి నగదు తీసుకునే వీడియోలు ఇటీవల వెలుగులోకి రావడంతో వివాదాస్పదమైంది.
- బందరు మండలం రుద్రవరం గ్రామ సమీపంలో చిన్నాపురం రహదారి పక్కనే నగరంలోని 29, 30, 31 డివిజన్‌లలోని పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చారు. రూ.150 కోట్లతో ఈ లే అవుట్‌ను మెరక చేసినట్టుగా చూపి బిల్లులు చేసుకున్నారు. మాజీమంత్రికి చెందిన 16 ఎకరాల భూమిని చేపలచెరువుగా మార్చి అందులోని మట్టితో ఈ లే అవుట్‌ను మెరకచేశారు.
- గుండుపాలెం పంచాయతీ పల్లెపాలెంలో లేఅవుట్‌ను అడుగు ఎత్తున కూడా మెరక చేయకుండా పూర్తిస్థాయిలో మెరక చేసినట్లుగా మాజీమంత్రి అనుచరుడు చూపి బిల్లులు చేసుకున్నారు. ఈ లేఅవుట్ మెరక పనులు సక్రమంగా చేయలేదని అప్పట్లో లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదు.
- చిన్నాపురంలోని రెండు లే అవుట్‌లలో వైసీపీ కార్యకర్తకు చెందిన చేపలచెరువులోని మట్టిని తరలించారు. పది కిలోమీటర్ల మేర దూరం నుంచి మట్టిని తరలించామని చూపి లక్షలాది రూపాయలు బిల్లులు చేసుకోవడం గమనార్హం.
- ఉల్లింగిపాలెంలోని లే అవుట్‌ను పూర్తిస్థాయిలో మెరక చేయకుండానే బిల్లులు చేసుకున్నారు. బందరు మండలంలోని 72 లేఅవుట్లలో అధిక శాతం మెరక పనుల్లో అక్రమాలు చోటుచేసుకోగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంతోపాటు ఇతర విభాగాల అధికారులు అధికార పార్టీ నాయకులకు తమవంతుగా సహకారం అందించి బిల్లులు చేశారు. ఈ అంశంపై త్వరలో విచారణ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

కూటమి ప్రభంజనంతో మొక్కులు చెల్లించుకున్న పార్టీ శ్రేణులు



జమలాపురం ఆలయం వద్ద కూటమి అభిమానులు, నేతలు

పెద్దాపురం టు జమలాపురం పాదయాత్ర

వీరులపాడు, జూన్ 6 : రాష్ట్రంలో కూటమి ప్రభంజనం సృష్టించడంతో పాటు విజయవాడ ఎంపీగా కేశినేని శివనాథ్ (చిన్ని), నందిగామ ఎమ్మెల్యేగా తంగిరాల సౌమ్యలు గెలుపొందడంతో పెద్దాపురం గ్రామం నుంచి సుమారు వెయ్యి మంది నేతలు, కార్యకర్తలు నిమ్మల రాజేంద్ర ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం ఎర్రుపాలెం మండలం జమలాపురం పుణ్య క్షేత్రం వరకు గురువారం పెద్ద ఎత్తున పాదయాత్రగా వెళ్లి స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీవారి మొక్కు చెల్లించుకున్న తెలుగుయువత నేత



ఉంగుటూరు, జూన్ 6 : రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి అధికారంలోకి వస్తే నడచి వచ్చి శ్రీవారిని దర్శించుకుంటానని మొక్కుకున్న గన్నవరం నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి, తేలప్రోలు గ్రామవాసి గులిపల్లి సందీప్ గురువారం తన మొక్కు తీర్చుకున్నాడు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, గన్నవరంలో యార్లగడ్డ వెంకట్రావు అఖండ మెజారిటీతో గెలవాలని తిరుమల ఏడుకొండల వెంకన్న స్వామికి సందీప్ మొక్కుకున్నాడు. శ్రీవారి కృపాకటాక్షాలతో టీడీపీ కూటమి భారీ మెజారిటీతో గెలుపొంది రికార్డు సృష్టించిందన్నారు. స్వామికి కృతజ్ఞతగా తాను మెట్లమార్గంలో కుటుంబసమేతంగా నడిచివెళ్లి శ్రీవారి మొక్కు చెల్లించుకున్నట్టు తెలిపారు.



తిరుమలగిరిలో వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద మహిళలతో తాతయ్య

తిరుమలగిరికి కాలినడకన..

జగ్గయ్యపేట : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే కాలినడకన వచ్చి దర్శనం చేసుకుంటామని జగ్గయ్యపేట టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన శ్రీరాం తాతయ్య సతీమణి శ్రీదేవి తిరుమలగిరి వెంకటేశ్వరస్వామికి చేసుకున్న మొక్కులను గురువారం తీర్చుకున్నారు. పట్టణంలో స్వయంభూ విష్ణేశ్వరస్వామి దేవస్థానం వద్ద శ్రీదేవి, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీరాం చినబాబు సతీమణి శ్రీవల్లీ, తాతయ్య కుమారుడు కిట్టు, రాష్ట్ర తెలుగునాడు అంగన్వాడీ, డ్వాక్రా సాధికారసమితి అధ్యక్షురాలు ఆచంట సునీత, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మీ, మహిళ నేతలు, కౌన్సిలర్లు, కుటుంబసభ్యులు తదితరులతో కలిసి పూజలు నిర్వహించి కాలినడక ప్రారంభించారు. స్వామివారి పాదాల వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

13న దుర్గగుడికి పాదయాత్ర

» టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేదరమెట్ల నాగేశ్వరరావు

వన్‌టౌన్, జూన్ 6 : కూటమి అభ్యర్థులకు ఏపీ ప్రజలు చరిత్రాత్మక విజయాన్ని చేకూర్చిన సందర్భంగా మొక్కు తీర్చుకునేందుకు తెలంగాణలోని మణుగూరు నుంచి విజయవాడ ఇంద్రకీలాద్రికి పాదయాత్ర చేయనున్నట్టు టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేదరమెట్ల నాగేశ్వరరావు చెప్పారు. గురువారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ ఈ నెల 13వ తేదీన మణుగూరు పట్టణంలోని హనుమాన్ దేవాలయం నుంచి తన పాదయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఎంతో ఆనందాన్నిచ్చిందని చెప్పారు. మేదరమెట్ల నాగేశ్వరరావు చంద్రబాబునాయుడుకు వీరభిమానిగా తెలుగు దేశం అనుబంధ సంస్థ టీఎన్‌టీయూసీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.



కొనకళ్ల, వర్ల కుమారరాజాలను సన్మానిస్తున్న గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు

కూటమికి బ్రాహ్మణ వర్గాల మద్దతు : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, జూన్ 6 : కూటమి విజయానికి బడుగు బలహీన వర్గాల వారితో పాటు పేద రైతులు, ఆటో కార్మికులు, బ్రాహ్మణ సోదరులు కూడా కృషి చేసారని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. గురువారం కొనకళ్ల నారాయణ, పామర్రు ఎమ్మెల్యేగా గెలుపొందిన వర్ల కుమార్ రాజాలను రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన జాతీయ అధ్యక్షుడు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, బ్రాహ్మణ సాధికారికత జిల్లా కన్వీనర్ పీవీ ఫణికుమార్‌లు కొనకళ్ల కార్యాలయం వద్ద సత్కరించారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ, అందరూ సమన్వయంతో పని చేయడం వల్ల కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీ సాధించారన్నారు. గెలుపొందిన అభ్యర్థులు ప్రజల ఆశయాలకు అనుగుణంగా సేవలందించాలని కొనకళ్ల పిలుపునిచ్చారు. వర్ల కుమరరాజా మాట్లాడుతూ, పామర్రు నియోజక వర్గ ప్రజలను ఎన్నడూ మరచిపోలేనన్నారు. గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ, ఆరు నెలలుగా చంద్రబాబు విజయం కోసం ద్రవ పదార్థాలు మాత్రమే తీసుకుంటూ శాంభవ దీక్షలో ఉన్నానన్నారు. 12వ తేదీన చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన తరువాత తిరుమలకు కాలినడకన వెళ్లి మొక్కుబడులు చెల్లించుకుంటానన్నారు. కార్యక్రమంలో లొల్లా కుంటుంబ శాస్త్రి, బ్రాహ్మణ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీకి కేశినేని శివనాథ్..



విద్యాధరపురం, జూన్ 6 : విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) శుక్రవారం ఢిల్లీలో జరగబోయే ఎన్డీఏ సమావేశంలో పాల్గొనడానికి బయలుదేరి వెళ్లారు. అంతకముందు చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని ఆయన నివాసంలో అందుబాటులో ఉన్న ఎంపీలతో సమావేశం కాగా.. చిన్ని పాల్గొన్నారు. మిగిలిన ఎంపీలు జూమ్ కాల్ ద్వారా చంద్రబాబుతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీలుగా గెలిచిన వారందరికీ చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలిచ్చిన తీర్పుతో ఎవరూ ఆకాశంలో విహరించవద్దని విజయాన్ని సమాజ సేవకు వినియోగించాలని హితబోధ చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్‌ను కేశినేని శివనాథ్ ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ తిరువూరు టీడీపీ నేత శావల దేవదత్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేశ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబును కలిసిన వసంత



జి.కొండూరు : టీడీపీ జాతీయ అధ్యక్షుడు, కాబోయే సీఎం చంద్రబాబు నాయుడ్ని ఉండవల్లిలోని ఆయన నివాసంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆయన తనయుడు ధీమంత్ సాయిలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో చంద్రబాబును ఘనంగా సత్కరించారు. మంచి మెజార్టీతో మైలవరం సీటును చంద్రబాబుకు కానుకగా ఇచ్చినందుకు వసంతను బాబు అభినందించారు.



పెనమలూరు సెంటర్లో ఏర్పాటు చేసిన లోకేశ్ రెడ్‌బుక్ ఫ్లెక్సీ

లోకేశ్ రెడ్ బుక్ పేరుతో ఫ్లెక్సీ..

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభంజనం సృష్టించిన నారా లోకేశ్ యువగళం సందర్భంగా.. తప్పు చేసిన రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల పేర్లను ప్రత్యేకంగా రెడ్ బుక్‌లో నమోదు చేసి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ లోకేశ్ పలు బహిరంగ సభల్లో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పెనమలూరుకు చెందిన టీడీపీ నాయకులు లోకేశ్ రెడ్‌బుక్ పేరుతో పెనమలూరు సెంటర్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చర్చనీయాంశమైంది. - పెనమలూరు

16న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు

» హాజరుకానున్న 11,112 మంది అభ్యర్థులు

» అధికారుల వీసీలో కలెక్టర్ ఢిల్లీరావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ) నేతృత్వంలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు జూన్ 16వ తేదీన విజయవాడ నగరంలో జరగనున్నాయి. రాష్ట్రంలో విశాఖపట్నం, అనంతపురం తిరుపతి, విజయవాడలో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. విజయవాడ నగరంలో 25 కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తం 11,112 మంది అభ్యర్థులు పరీక్షలను రాయనున్నారు. జూన్ 16వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష నిర్వహణకు సంబంధించి యూపీఎస్సీ అధికారులు గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్టీఆర్ కలెక్టర్ ఢిల్లీరావు పాల్గొని ఇక్కడి ఏర్పాట్లను వివరించారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ యూపీఎస్సీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

చంద్రబాబు, లోకేశ్‌లను కలిసిన బుద్దా వెంకన్న



వన్‌టౌన్ : టీడీపీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నికైన చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్‌లను గురువారం పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురికి దుశ్శాలువాలు కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కేశినేని శివనాథ్‌ను కలిసిన వసంత..



విద్యాధరపురం, జూన్ 6 : విజయవాడ ఎంపీగా గెలిచిన కేశినేని శివనాథ్(చిన్ని)ను కలిసేందుకు వచ్చిన జనసందోహంతో గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్ కిట కిట లాడింది. అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో సందడి నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎక్కడా బ్రేక్ లేకుండా శివనాథ్‌కు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా పార్టీ గెలుపుకోసం పని చేసిన ప్రతి ఒక్కరికి శివనాథ్ కృతజ్ఞతలు తెలిపారు. అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో ఫొటోలు దిగారు

ఎన్నికల నిర్వహణలో అధికారుల కృషి భేష్

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కలెక్టర్ ఢిల్లీరావును సత్కరిస్తున్న సర్వోదయ ట్రస్టు ప్రతినిధులు

కృష్ణలంక, జూన్ 6 : ఎన్టీఆర్ జిల్లాలో సాధారణ ఎన్నికలు-2024 ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యావాదలు తెలియజేస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్ తదితరులతో సమావేశమయ్యారు. సీఈఓ కార్యాలయానికి వివిధ ఫారాలతో అందించాల్సిన నివేదికలపై సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ, మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియతో పాటు వీటి సన్నద్ధతా కార్యకలాపాల్లో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, ఇతర అధికారులు, సిబ్బంది ఎంతో అంకితభావం, నిబద్ధతతో వ్యవహరిస్తూ విధులు నిర్వర్తించారని ఆయన తెలిపారు. అదేవిధంగా ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న జిల్లా ఎన్నికల పరిశీలకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన జిల్లా పోలీస్ అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు.

పోలింగ్, ఓట్ల లెక్కింపు కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో నిర్వహించడంలో సహకరించిన రాజకీయ పక్షాల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా రూపకల్పన దగ్గరి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రతి దశలో ఆయా అధికారులు, సిబ్బంది తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించారని కలెక్టర్ కొనియాడారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియతో పాటు ఈసీఐ నూతనంగా ప్రవేశపెట్టిన హోం ఓటింగ్ ప్రక్రియలో భాగస్వాములైన బృందాలకు అభినందనలు తెలియజేశారు. ఎన్నికల ప్రక్రియలో అన్ని విధాల సహకరించిన జిల్లా ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది, జిల్లా అధికారులు, వివిధ విభాగాల నోడల్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, స్క్వాడ్‌లు, సెక్టార్ అధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డ్రైవర్లు, పారిశుధ్య సిబ్బంది, జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అన్ని శాఖల అధికారులు, ఇతర ఎన్నికల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులకు జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

కలెక్టర్‌ను సత్కరించిన సర్వోదయ ట్రస్ట్ :

అత్యంత పారదర్శకతతో జవాబుదారీతనంతో ప్రజాస్వామ్య స్ఫూర్తితో విజయవంతంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును సర్వోదయ ట్రస్టు ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఓటర్ల జాబితా రూపకల్పన దగ్గరి నుంచి ఫలితాల వెల్లడి వరకు ప్రతి దశలోను కలెక్టర్ ఢిల్లీరావు ప్రశంసాపూర్వక విధులు నిర్వహించినట్టు ఈ సందర్భంగా సర్వోదయ ట్రస్టు సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు మోతుక్కారి వెంకటేశ్వరరావు, వేమూరి బాబురావు పేర్కొన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు బీహెచ్ భవానీశంకర్, ఎ.రవీంద్రరావు, కె.మాధవి, జి.వెంకటేశ్వర్లు, ఇ.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో మార్పు మొదలైంది

» మున్సిపల్ పార్కుకు నాని పేరు తొలగింపు

» చెత్త సేకరణ పాయింట్ గోడల కూల్చివేత

» ఎత్తిపోతల పథకం పేరు మార్పు.. స్థానికుల ప్రతీకారం..

గుడివాడ, జూన్ 6 : గత వైసీపీ పాలనలో జరిగిన విధ్వంసానికి స్థానిక ప్రజలే తగిన సమాధానం చెబుతున్నారు. ఎక్కడికక్కడ గత పాలకుల నామరూపాలు లేకుండా మార్చేస్తున్నారు. పార్టీలకతీతంగా కొడాలి నానికి రిటర్న్ గిఫ్ట్‌లను యిస్తున్నారు.

● గుడివాడ రాజేంద్రనగర్‌లోని పార్కుకు వైసీపీ ప్రజాప్రతినిధి కొడాలి నాని తన పేరు పెట్టుకున్నాడు. 20ఏళ్లుగా గుడివాడ అభివృద్ధి పట్టని వ్యక్తి పేరు అక్కడ ఉండటాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు పార్కు ముఖద్వారానికి ఉన్న నాని పేరును తొలగించారు.



కొడాలి నాని పేరు తొలగించిన పార్కు





ధ్వంసం చేసిన చెత్త సేకరణ పాయింట్ గోడలు

● స్థానిక మెయిన్ రోడ్డులోని తుమ్మల రాంబ్రహ్మం పార్కులో ఆర్యవైశ్య కళ్యాణమండపానికి ఆనుకుని రాజకీయ కక్ష సాధింపులో భాగంగా కొడాలి నాని చెత్త సేకరణ పాయింట్‌ను పెట్టించారు. ఎన్నికల సమయంలో దానిని మూసివేస్తున్నట్టు నటించి అడ్డుగోడ కట్టించారు. పార్టీలకతీతంగా ప్రజలు స్వచ్ఛందంగా సదరు సేకరణ పాయింట్ రెండు వైపుల గోడలను ధ్వంసం చేసి తమ అభిప్రాయాన్ని తెలిపారు.

● నందివాడ మండలం అరిపిరాల వద్ద రూ.9కోట్ల వ్యయంతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించింది. దానికి ఎన్టీఆర్ ఎత్తిపోతల పథకంగా నామకరణం చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే కొడాలి నాని ఎన్టీఆర్ పేరును తొలగించి వైఎస్సార్ పేరుతో తిరిగి ప్రారంభోత్సవం చేశారు. కూటమి అధికారంలోకి రావడంతో స్థానిక రైతులు మూకుమ్మడిగా వైఎస్సార్ పేరును తొలగించి, నాని వేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు.

పదేళ్లకు ఎగిరిన పసుపు జెండా..

» జెయింట్ కిల్లర్ వెనిగండ్ల



గుడివాడ, జూన్ 6 : గుడివాడ ప్రజలు అభిమానిస్తే ఎలా ఉంటుందో 20 ఏళ్లుగా చూసారు. అభివృద్ధి చేయకున్నా మాయమాటలకు, బీదవాపులకు తలొగ్గి నాలుగు పర్యాయాలు కొడాలి నానిని ఆదరించారు. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న నాని ఆర్థికంగా బాగా స్థిరపడ్డాడు. ప్రజలు తమ సమస్యలను తెలుపుకునేందుకు వెళితే అన్నీ అడ్డంకులే. నలుగురిని దాటితేగానీ నాని దర్శనం దొరికేది కాదు. దొరికినా వినతిపత్రాలు బుట్టదాఖలయ్యేవి. సమస్య పరిష్కారమయ్యేది కాదు. విసిగి వేసారిన గుడివాడ ప్రజలు మార్పు కోరుకున్నారు.

కూటమి శ్రేణుల సమష్టి కృషి ఫలితంగా దశాబ్ద కాలం తరువాత గుడివాడ గడ్డపై పసుపు జెండా రెపరెపలాడింది. ఎన్నికలకు నాలుగు నెలలు ముందుగానే కూటమి అభ్యర్థిగా రాజకీయాల్లోకి కొత్తగా వచ్చిన వెనిగండ్ల రామును అభ్యర్థిగా ప్రకటించారు. అప్పటికే వెనిగండ్ల ఫౌండేషన్ పేరుతో ఏడాదిన్నరగా ఆయన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తుఫాన్ సమయంలో సొంత నిధులతో పంటకాలువలు, డ్రెయిన్లలో పేరుపోయిన పూడికతీతను తీయించి రైతుల పక్షాన నిలిచారు. ప్రజలతో మమేకమై వారి కష్టాలను తీర్చి అండగా నిలిచారు. క్లీన్ ఇమేజ్ కూడా వెనిగండ్లకు కలిసొచ్చింది. నానిని చిత్తుగా ఓడించి తెలుగు రాష్ట్రాల్లో జెయింట్ కిల్లర్‌గా నిలిచారు. అందరి దృష్టిని ఆకర్షించారు.

హుందాతనమే వెనిగండ్ల నైజం..

తన వద్దకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి సమస్యను సావధానంగా విన్నారు. ఎన్నికల ప్రచారంలో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పుస్తకంలో పొందుపరిచారు. రైతుకు అండగా నిలిచారు. టిడ్కో నివాసితులకు తాగు నీరు లేకపోతే నీటి ట్యాంకర్‌లను ఏర్పాటు చేశారు. కొడాలి నాని ఎన్నిసార్లు టార్గెట్ చేసి మాట్లాడినా.. వెనిగండ్ల సున్నితంగా వ్యవహరించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తానే గానీ చవకబారు వ్యాఖ్యలకు స్పందించబోనని హుందాగా ప్రకటించారు.

రాముకు చంద్రబాబు అభినందన

గుడివాడ : రికార్డు మెజార్టీతో మాజీ మంత్రి కొడాలి నానిపై ఘన విజయం సాధించిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రామును టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అభినందించారు. బుధవారం రాత్రి ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న చంద్రబాబును వెనిగండ్ల కలిసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. భుజం తట్టి భళా రాము.. భళా అని రామును చంద్రబాబు అభినందించారు. గుడివాడ అభివృద్ధే ఎజెండాగా పనిచేస్తానని చంద్రబాబుకు వెనిగండ్ల తెలిపారు.

నేనే దుర్గగుడి చైర్మన్!

» మాజీ రౌడీషీటర్ హల్‌చల్

» కాంట్రాక్టర్లు, ఉద్యోగులకు బెదిరింపులు

వన్‌టౌన్, జూన్ 6 : దుర్గగుడి ధర్మకర్తల మండలికి కాబోయే చైర్మన్‌ను తానేనంటూ ఓ మాజీ రౌడీషీటర్ హల్‌చల్ చేస్తున్నాడు. ఎన్నికల సమయంలో వైసీపీ నుంచి జనసేనలోకి వచ్చిన ఆయన ఇప్పుడు దుర్గగుడి చైర్మన్ పోస్టుపై కన్నేశాడు. ఇంకా ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయకుండానే పదవులను ప్రకటించేసుకున్నాడు. సూరత్ పట్టుచీరల ముక్కలు విక్రయంలో పలు కేసుల్లోను, ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. దుర్గగుడిలో పలువురు కాంట్రాక్టర్లు, ఉద్యోగులను బెదిరిస్తున్నట్టు చెబుతున్నారు. భవానీపురానికి చెందిన ఈ మాజీ రౌడీ షీటర్ ఎన్నికలకు రెండు నెలల ముందు వైసీపీ నుంచి జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నాడు. ఎన్నికల్లో తాను పశ్చిమ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు కొన్ని రోజులు హడావుడి చేశాడు. తీరా పశ్చిమ నియోజకవర్గం పొత్తులో బీజేపీకి సీటు రావడంతో కొన్ని రోజులు కనిపించకుండా పోయాడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ తెరపైకి వచ్చిన ఈ మాజీ రౌడీషీటర్ తానే పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిని గెలిపించినట్టు బీరాలు పలుకుతూ ప్రచారం చేస్తున్నాడు. మూడురోజుల నుంచి తాను దుర్గగుడికి కాబోయే చైర్మన్‌నంటూ ప్రచారం చేస్తూ తనకు గిట్టని పలువురు దుర్గగుడిలోని కాంట్రాక్టర్‌లను బెదిరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాను చైర్మన్ అయిన తరువాత ఆ కాంట్రాక్టర్‌లందరిని గుడి నుంచి పంపించేస్తానంటూ బెదిరింపులకు గురిచేస్తున్నట్టు పలువురు కాంట్రాక్టర్‌లు, ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. తనకు అనుకూలంగా ఉన్న బీజేపీకి చెందిన వ్యక్తిని దుర్గగుడి ధర్మకర్తగా నియమించినట్టు ప్రచారం చేస్తున్నాడు. ఆ వ్యక్తికి దుర్గగుడిలోని లోటుపాట్లు మొత్తం తెలుసునని, అతడి ద్వారా దుర్గగుడిలో ఏ విభాగాలలో ఎక్కడెక్కడ అవినీతి జరుగుతుందో తెలుసుకుని ఆ ఉద్యోగులందరిపై చర్యలు తీసుకుంటామని చెప్పడం దేవస్థానంలో చర్చనీయాంశమైంది. ఆ జనసేన పార్టీ నాయకుడు చిట్టినగర్ కేఎల్ రావు నగర్‌లో జరిగిన ఓ వ్యక్తి హత్య కేసులో నిందితుడు. ఇతడిపై భవానీపురం, విద్యాధరపురంలో భూ కబ్జా చేసినట్టు కూడా కేసులున్నాయి. రెండు నెలల ముందు పార్టీలోకి వచ్చి తానే పెద్ద నాయకుడినంటూ ప్రచారం చేసుకుంటున్న ఆ మాజీ రౌడీ షీటర్‌పై జనసేనలోనే పలువురు సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనప్పటికీ అతగాడు చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదని జనసేన నాయకులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

దారితప్పిన పాలనను గాడిలో పెట్టాలి

కూటమికి హైకోర్టు ఉద్యోగుల సంఘం అభినందన

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాలరావు అభినందనలు తెలిపారు. కొత్తగా కొలువుదీరే ప్రభుత్వం రాష్ట్రంలో దారితప్పిన పాలనను గాడిలో పెట్టేందుకు కృషి చేయాలని కోరారు. కొత్త పీఆర్సీని సాధ్యమైనంత త్వరగా అమలు చేయాలని కోరారు.

నేటి నుంచి ఇగ్నో పరీక్షలు

వన్‌టౌన్, జూన్ 6 : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విద్యాలయం(ఇగ్నో)లో ఈ నెల 7వ తేదీ నుంచి 2024 టెర్మ్ ఎండ్ పరీక్షలు జరుగుతాయని విజయవాడ ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డీఆర్ శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ కేంద్ర పరిధిలో విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. హాల్‌టికెట్లు ఇప్పటికే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇగ్నో వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ప్రాక్టికల్స్‌కు సంబంధించి అభ్యర్థులు తమ తమ అధ్యయన కేంద్రాల్లో థీయరీ పరీక్షల అనంతరం సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాల కోసం కొత్తపేట హిందూహైస్కూల్‌లోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రంను స్వయంగా సందర్శించడం కానీ లేదా 0866-2565253 నెంబర్‌కు ఫోన్ చేసి కానీ తెలుసుకోవచ్చన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

» ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం



జగ్గయ్యపేట, జూన్ 6 : జగ్గయ్యపేటలో ఇంజనీరింగ్ చదువుతున్న ప్రకాశం జిల్లా విద్యార్థి చిల్లకల్లు వద్ద బైక్‌పై వెళుతూ డివైడర్‌ను ఢీకొని దుర్మరణం చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. ప్రకాశం జిల్లా వెంగాయ పాలేనికి చెందిన రాములపల్లి శ్రీనివాస్ (20) జగ్గయ్యపేటలో మండవ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఇ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి ఇదే కళాశాలలో చదువుతున్న తెలంగాణా రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన డేస్కాలర్‌గా చదువుతున్న సలీం బైక్‌పై టిఫిన్ చేసి వస్తామని వెళ్లారు. రాత్రి భోజనం వేళకు రాకపోవడంతో శ్రీనివాస్ మిత్రులు, హాస్టల్ మేట్స్ అతడికి ఫోన్ చేశారు. జగ్గయ్యపేట నుంచి చిల్లకల్లు రోడ్డులో ఎంపీడీవో కార్యాలయం సమీపంలో డివైడర్‌ను ఢీకొని రక్తపు మడుగులో పడి ఉన్న శ్రీనివాస్ ఫోన్ రింగ్ కావటంతో స్థానికులు ప్రమాద విషయాన్ని చెప్పారు. హుటాహుటిన వారు బైక్ పైనే శ్రీనివాస్‌ను జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధృవీకరించారు. సలీంకు కాలు ఫ్రాక్చర్ అయినట్టు తెలిసింది. మృతదేహానికి చిల్లకల్లు ఎస్సై సతీష్ గురువారం పోస్టుమార్టమ్ అనంతరం బంధువులకు అప్పగించారు. వ్యవసాయ కూలీ అయిన వెంకటేశ్వర్లుకు ఒక్కగానొక్క కొడుకు శ్రీనివాస్. ఎంతో ఇబ్బంది పడి కొడుకును చదివిస్తున్నామని, మంచి ఉద్యోగంతో ఆదుకుంటాడనుకున్న కొడుకు దుర్మరణం చెందటంపై కన్నీటి పర్యంతమయ్యారు. కళాశాల హాస్టల్‌లో భద్రత ఉంటుందని చేర్పిస్తే.. నిర్లక్ష్యంగా బయటకు పంపించారని, అదే తమ కొంప ముంచిందన్నారు.

జీవచ్ఛవంలా.. జీవనది!

» గత పాలకుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

వైసీపీ పాలనలో కంచికచర్ల మండలం కునికినపాడు, చెవిటికల్లు, గనిఆత్కూరు, మున్నలూరు గ్రామాల పరిధిలో కృష్ణా నదీ గర్భాన్ని భారీ యంత్రాలతో కొల్లగొట్టారు. అడ్డగోలుగా 20 నుంచి 30 అడుగుల లోతు వరకు ఇసుకను తవ్వేశారు.. గతంలో నదిలో ఎప్పుడూ నీటి ప్రవాహం ఉండేది. వేసవిలో ఇసుక బంగారంలా మెరుస్తూండేది. అలాంటిది నేడు నది స్వరూపమే మారిపోయింది. కంప చెట్లతో అడవిని తలపిస్తున్నది. తీర గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. - కంచికచర్ల



ఎడారిని తలపిస్తున్న కృష్ణానది

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310



నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ.4.50

20న అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

ఉయ్యూరు, జూన్ 6: ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలానికి బస్సు నడుపుతున్నట్టు ఉయ్యూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కేఎస్ఆర్కే ప్రసాద్ గురువారం తెలిపారు. ఈనెల 20న రాత్రి 8 గంటలకు ఉయ్యూరు నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి 21న కాణిపాకం, సిరిపురం గోల్డెన్ టెంపుల్ అదేరోజున అరుణాచలంలో గిరిప్రదక్షిణ, స్వామి దర్శనం అనంతరం కంచి, తిరుత్తణి, శ్రీకాళహస్తి దేవాలయాల్లో దర్శనమయ్యాక 24న ఉయ్యూరు చేరుకుంటుందని తెలిపారు. ఉయ్యూరు నుంచి టికెట్ రూ.3వేలు, విజయవాడ నుంచి రూ.2,900 అని ఖర్చులు ఎవరివి వారే భరించాలని, సర్వీసు నంబరు 95599 ద్వారా ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని తెలిపారు. 73828 93468, 89193 66868, 95532 05796 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నగదు బ్యాగ్ చోరీ..
దొంగను పట్టుకున్న స్థానికులు

హనుమాన్‌జంక్షన్, జూన్ 6: బంగారు దుకాణం యజమానికి చెందిన నగదు బ్యాగ్‌ను అపహరించి పారిపోతున్న దొంగను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం రాత్రి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట జరిగింది. ఆర్టీసీ బస్టాండ్ ఎదుట లక్ష్మీ జ్యూయలరీ షాపు నిర్వహిస్తున్న ఆచారి తన దుకాణం మూసేసి చేతిలో ఉన్న బ్యాగ్‌ను పక్కన పెట్టి షట్టర్‌కు తాళాలు వేస్తుండగా దుకాణం ఎదురుగా జ్యూస్‌బండి వద్ద జ్యూస్ తాగుతున్న వ్యక్తి బ్యాగ్‌ను పట్టుకొని ఉడాయించాడు. సమీపంలో ఉన్న మరోవ్యక్తి ద్విచక్ర వాహనంపై ఎక్కి పారిపోతుండగా దుకాణం యజమాని దొంగ దొంగ అని అరిచేసరికి స్థానికులు పట్టుకున్నారు. ద్విచక్రవాహనం నడిపే వ్యక్తి వాహనాన్ని అక్కడే వదిలి పారిపోగా బ్యాగ్ దొంగిలించిన వ్యక్తి పట్టుబడ్డాడు. బ్యాగ్‌లో రూ.20 వేలు ఉన్నాయని ఆచారి తెలిపారు. ద్విచక్ర వాహనంతో పాటు దొంగను పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారణ చేపట్టారు. పట్టుబడిన వ్యక్తిది మధ్యప్రదేశ్‌గా భావిస్తున్నారు. రద్దీ ప్రాంతంలో రెక్కీ నిర్వహించి చోరీకి పాల్పడడంతో జంక్షన్ సెంటర్‌లో కలకలం రేగింది.

పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడి
కారు అద్దాలు ధ్వంసం

హనుమాన్‌జంక్షన్, జూన్ 6: జంక్షన్ పీఎస్ పరిధిలోని కొయ్యూరు గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొల్లి చిట్టిబాబు ఇంటిపై గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి ఇంటి ముందు నిలిపి ఉన్న కారు అద్దాలను పగులకొట్టారు. ఎస్సై జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ముందుకు వెళ్లి చిట్టిబాబును పిలవగా అయన కుమారుడు బయటికి వచ్చాడు. అతనిపై సీసా విసిరేయడంతో లోపలికి వెళ్లిపోయాడు. ఇంటి ముందు నిలిపి ఉన్న కారు అద్దాలను పగులకొట్టి కారులో పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేదపాఠశాలలో యజుర్వేద పారాయణలు

ఉయ్యూరు, జూన్ 6: సాయిపురం శ్రీచంద్రశేఖర ఆర్ష విద్యాలయం(వేదపాఠశాల)లో లోకపద్రవ శాంతి, లోక రక్షణకు శుక్రవారం నుంచి 108 రోజలపాటు అష్టోత్తరశత సంపూర్ణ కృష్ణ యజుర్వేద పారాయణలు వైభవంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు కప్పగంతు వేంకట శివసీతారామహ విర్వాజి తెలిపారు. శుక్రవారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు గణపతి పూజ, మండ పారాధన, స్వస్తి వాచనం, గురు వందనం, వేద పారాయణంతో ప్రారంభమవుతుందని, రోజూ ఉదయం ఎనిమిదిన్నర గంటలకు మంటప పూజ, 9 నుంచి 12 గంటల వరకు వేదపారాయణ, నవగ్రహ హోమం, తదుపరి హారతి, మంత్రపుష్పం నిర్వహిస్తామని 94919 64279, 96181 64616లో సంప్రదించాలని తెలిపారు.



యార్లగడ్డ వెంకట్రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, జనసేన జిల్లా జాయింట్ సెక్రటరీ చిమటా రవివర్మ, ఉంగుటూరు తెలుగుయువత నాయకులు అనగాని సురేష్, బెజవాడ నాగేశ్వరరావు

అభినందనల వెల్లువ

యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్‌కు టీడీపీ, జనసేన నేతల శుభాకాంక్షలు, సత్కారాలు

హనుమాన్‌జంక్షన్, జూన్ 6: గన్నవరం ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన యార్లగడ్డ వెంకట్రావుకు బాపులపాడు మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు విజయవాడలోని యార్లగడ్డ నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాజేశ్వరరావుతో పాటు తెలుగుయువత నాయకులు దయాల రాజీవ్‌కాంత్, టీడీపీ కానుమోలు గ్రామ అధ్యక్షుడు చెడుగొండి శివశంకర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాజులపాటి నాగరాజు, చలసాని శ్రీనివాసరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

● **హనుమాన్‌జంక్షన్‌రూరల్:** తెలుగువారు విదేశాల్లో స్థిరపడినా, యువత ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లినా టీడీపీ వల్లే సాధ్యమయిందని విదేశాల్లో చదువుకుంటున్న రంగన్నగూడేనికి చెందిన మొవ్వా సాయికృష్ణ అన్నారు. యార్లగడ్డ వెంకట్రావును విజయవాడలో మర్యాద పూర్వ కంగా కలిసి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. వేణుగోపాల్ పాల్గొన్నారు.

● **గన్నవరం:** టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన యార్లగడ్డ వెంకట్రావును టీడీపీ, జనసేన నాయకులు గురువారం కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన జిల్లా జాయింట్ సెక్రటరీ చిమట రవివర్మ, పసుపులేటి చంద్రశేఖర్, శ్రీపతి శ్రీనివాస్, పల్లి కార్తిక్, కోటి, గోపాలకృష్ణ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు. తాను గన్నవరం వచ్చిననాటి నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, శ్రేణులు ఎంతో ఆదరించారని యార్లగడ్డ తెలిపారు. తన గెలుపు కోసం ఎనలేని కృషి చేశారని చెప్పటంలో ఎలాంటి అతిశయోక్తి లేద న్నారు. అందరి సహకారాన్ని మరువబోనని చెప్పారు. నియోజకవర్గాన్ని ఎన్నికల ముందు చెప్పినట్టుగా మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు.

● **ఉంగుటూరు:** తెలుగుయువత నాయకులు, నందమూరు అనగాని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అనగాని సురేష్, టీడీపీ మానికొండ ఉపాధ్యక్షుడు బెజవాడ నాగేశ్వరరావు తదితరులు గురువారం యార్లగడ్డను కలిసి అభినందనలు తెలిపారు.

● **ఉయ్యూరు:** గన్నవరం టీడీపీ కార్యాలయంలో యార్లగడ్డ వెంకట్రావుకు ముదునూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాలడుగు సత్యనారాయణ పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ, జనసేన
సమన్వయంతో పని చేస్తాయి: ముప్పా రాజా

కంకిపాడు: నియోజకవర్గ అభివృద్ధికి జనసేన, టీడీపీ సమన్వయంతో పనిచేస్తాయని జనసేన పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా అన్నారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన బోడె ప్రసాద్‌ను కలిసి ఆయన ఘనంగా సత్కరించారు. జనసేన నాయకులు బాయిన నాగరాజు, సుంకర శివ, పచ్చిపాల శేఖర్, సుంకర సురేష్, మేదండ్రావు సతీష్, గుంటా గంగాధర్ పాల్గొన్నారు. బోడె ప్రసాద్‌కు టీడీపీ మద్దూరు నాయకులు సత్కారం చేశారు. యనమదల మదన్, వై.వెంకటేశ్వరరావు, రాజేష్, వై.సత్యనారాయణ, తీట్ల మధు, పామర్తి నాని, ఆరేపల్లి గోపి, వీరంకి బాలకృష్ణ, వల్లె నరసింహారావు, లింగాల వెంకటస్వామి పాల్గొన్నారు.



బోడె ప్రసాద్‌ను సత్కరిస్తున్న జనసేన నాయకుడు ముప్పా రాజా తదితరులు, మద్దూరు టీడీపీ నాయకులు

ఉయ్యూరులో టీడీపీకి 7,102 ఓట్ల ఆధిక్యం

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలోని 20వార్డుల్లో కలిపి బోడె ప్రసాద్‌కు 7,102 ఓట్ల ఆధిక్యం వచ్చింది. 37 పోలింగ్ బూత్‌లకు గాను 32 బూత్‌లలో బోడె ప్రసాద్‌కు ఆధిక్యం వచ్చింది. 242 నంబరు బూత్‌లో బోడె ప్రసాద్ 398 ఓట్ల మెజారిటీ సాధించారు. వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్‌కు 259 నంబరు బూత్‌లో 16, 262 నంబరు బూత్‌లో 39, 266 నంబరు బూత్‌లో 172, 269 నంబరు బూత్‌లో 220, 272 నంబరు బూత్‌లో 9 ఓట్లు అధికంగా వచ్చాయి. 242 నంబరు బూత్‌లో అత్యధిక మెజారిటీ సాధించినందుకు బోడె ప్రసాద్‌కు 16వ వార్డు ఇన్‌చార్జ్ ఈడే అంజిబాబు, ఆరేపల్లి సుబ్బారావు, చలపాటి శ్రీను, ముచ్చు సుదర్శనరావు శుభాకాంక్షలు తెలిపారు.



బోడె ప్రసాద్‌కు కేక్ తినిపిస్తున్న అంజిబాబు



అనుమోలు ప్రభాకరరావు సమక్షంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుకు సమ్మె విరమణ పత్రాన్ని అందిస్తున్న కార్మికులు

మునిసిపల్ చెత్త వ్యాను డ్రైవర్ల సమ్మె విరమణ

● **నేటి నుంచి విధుల్లోకి..తీరనున్న చెత్త సమస్య**

పెనమలూరు, జూన్ 6: గత నెల 20 నుంచి సమ్మె చేస్తున్న మునిసిపల్ చెత్త వ్యాను డ్రైవర్లు తాడిగడప మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు హామీతో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు ఆధ్వర్యంలో కమిషనర్‌తో సీఐటీయూ నాయకులు ఉప్పాడ త్రిమూర్తులు, మస్తాన్‌వలి, సరళ, వ్యాను డ్రైవర్లు చర్చలు జరిపాక వ్యాను డ్రైవర్లు సమ్మె విరమించారు. వ్యాను డ్రైవర్ల జీతాలు ప్రతినెలా పదో తేదీకల్లా ఇస్తామని, కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఏర్పడిన తర్వాత కాంట్రాక్ట్ పద్ధతిని తొలిగించి డ్రైవర్లను నేరుగా మునిసిపాలిటీలోకి తీసుకుంటామని ఇచ్చిన హామీల మేరకు డ్రైవర్లు సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో రెండు వారాలుగా పేరుకుపోయిన చెత్తతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగనున్నాయి.

మర్యాదపూర్వకంగా..

గన్నవరం: మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందిన నారా లోకేశ్‌ను తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మండవ అన్వేష్ కలిసి, సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. లోకేశ్‌కు భారీ మెజార్టీ రావటం చాలా సంతోషంగా ఉందన్నారు.



లోకేశ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మండవ అన్వేష్

పుస్తకపఠనంతో మానసిక ఒత్తిడి దూరం

ఉంగుటూరు, జూన్ 6: నిత్యం పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా చేసుకుంటే మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఒత్తిళ్లు దూరమవుతాయని, పుస్తక పఠనంతో మేధో సంపత్తి వృద్ధి చెందుతుందని ఆత్కూరు, మానికొండ, తేలప్రోలు, ఉంగుటూరు గ్రంథాలయాధికారులు బీవీ కృష్ణారావు, ఎల్.హరికృష్ణ, బి.శ్రీనివాసరావు, యు.చంద్రశేఖరరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మండలంలోని నాలుగు గ్రంథాలయాల్లో గురువారం విద్యార్థులకు పలు అంశాలపై ఆయన ఆటపాటల పోటీలు నిర్వహించారు. మానికొండ గ్రంథాలయంలో విద్యార్థులతో కథలు చెప్పించడం, నీతికథలు చదివించడం, చదరంగం, క్యారమ్స్ లూడో ఆటలు ఆడించారు. ఆత్కూరు గ్రంథాలయంలో పేపర్ ఆర్ట్ నేర్పించారు. ఉంగుటూరు గ్రంథాలయంలో స్టోరీ టెల్లింగ్, పేపర్‌రీడింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. శుక్రవారంతో వేసవి విజ్ఞాన శిబిరాలు ముగుస్తాయని, ఇప్పటివరకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారులు పేర్కొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మానసిక వికాసానికి, పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని కో-ఆపరేటివ్ బ్యాంక్ విశ్రాంత అధికారి బాబూరావు విద్యార్థులకు సూచించారు. వీరవల్లి గ్రంథాలయంలో వేసవి విజ్ఞానశిబిరం నిర్వహణలో భాగంగా గురువారం విద్యార్థులకు పుస్తక పఠనం, చెస్, క్యారమ్స్, లూడో ఆటల్లో పోటీలు నిర్వహించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసా పత్రం, బహుమతి ప్రదానం చేస్తామని గ్రంథాలయాధికారి పి.స్వర్ణలతాదేవి ఈ సందర్భంగా తెలిపారు.



కాకులపాడులో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చలసాని శ్రీనివాస్, త్రిపురనేని సత్యనారాయణ, అల్లాపురంలో కేక్ కట్ చేస్తున్న జాస్తి వెంకటేశ్వరరావు తదితరులు

టీడీపీ, జనసేన శ్రేణుల విజయోత్సవాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 6: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం ప్రజా విజయమని టీడీపీ నాయకుడు చలసాని శ్రీనివాస్, జనసేన నాయకుడు అడపా దేవులబాబు వేర్వేరు కార్యక్రమాల్లో పేర్కొన్నారు. బాపులపాడు మండలంలోని గ్రామాల్లో గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు విజయోత్సవాలు నిర్వహించారు. కాకులపాడులో టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో చలసాని శ్రీనివాస్, త్రిపురనేని సత్యనారాయణ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాణాసంచా కాల్చి, కేక్‌కట్ చేసి ప్రజలకు మిఠాయిలు పంచారు. రెడ్డి శ్రీనివాసరావు, కామినేని శ్రీహరి, వాసు, పాల్గొన్నారు. ఎస్ఎన్ పాలెంలో జనసేన నాయకుడు అడపా దేవులబాబు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులతో కలిసి భారీ కేక్‌ను కట్‌చేశారు. కంపసాటి కొండలరావు, అడపా సతీష్, అంజిబాబు, మత్తి రామారావు, సాంబశివరావు పాల్గొన్నారు. మల్లవల్లిలో యనమదల వెంకయ్యారావు, అక్కినేని ధర్మరాజు ఆధ్వర్యంలో, మడిచర్లలో పుట్టా సురేష్, మాటూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రజలకు మిఠాయిలు పంచి విజయోత్సవాలు నిర్వహించారు.

సమష్టి కృషితోనే
యార్లగడ్డకు భారీ మెజారిటీ

గన్నవరం: సమష్టి కృషితోనే యార్లగడ్డ వెంకట్రావుకు భారీ మెజారిటీ వచ్చిందని టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని అల్లాపురంలో యార్లగడ్డ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు చిక్కవరపు నాగమణి, ఎం.శ్రీనివాసరావు, మండవ లక్ష్మి, పరసా కిరణ్, బుస్సే సరితాదేవి, బడుగు గోపి, గంతోటి కుమార్, పడమట వెంకటేశ్వరరావు, బోలెం శంకర్, మట్టా వేణు, బొర్రా సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



కానూరు కేసీపీ కాలనీ సాయిబాబా ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న తెలుగు మహిళలు

108 కొబ్బరి కాయలు కొట్టి
మొక్కు తీర్చుకున్న తెలుగుమహిళలు

పెనమలూరు, జూన్ 6: టీడీపీ కూటమి భారీ విజయం సాధించి, ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్ గెలుపొందిన సందర్భంగా తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర ఆధ్వర్యంలో కానూరు కేసీపీ కాలనీ తెలుగు మహిళలు సాయిబాబా ఆలయం వద్ద 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకొన్నారు. యార్లగడ్డ రూప్‌కుమార్, కళ్యాణి, కస్తూరి, జ్యోతి, లక్ష్మి, లక్ష్మీసుధ, నీరజ, ప్రవీణ, కిషోర్ పాల్గొన్నారు.

యనమలకుదురులో..

చంద్రబాబు ముఖ్యమంత్రిగా, బోడె ప్రసాద్ ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా యనమలకుదురు గోపాలస్వామి ఆలయంలో కోదండరామ భజన సమాజం సభ్యులు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. యనమలకుదురు ఎన్టీఆర్ గార్డెన్స్ వద్ద నిర్వహించిన గెలుపు సంబరాల్లో టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, పార్టీ తాడిగడప మునిసిపాలిటీ కార్యదర్శి మొక్కపాటి శ్రీనివాస్ ఆధ్వర్యాన స్థానికులకు స్వీట్లు పంచారు.




కొల్లు రవీంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్నా, కుమార్‌రాజాను అభినందిస్తున్న కంకిపాడు నాయకులు సుదిమళ్ల రవీంద్ర, పులి శ్రీనివాసరావు

కొల్లు రవీంద్ర, వర్ల కుమార్‌రాజాకు సత్కారం

గన్నవరం, జూన్ 6: మచిలీపట్నం ఎమ్మెల్యేగా గెలుపొందిన కొల్లు రవీంద్రను పలువురు టీడీపీ నాయకులు గురువారం కలిసి సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. రవీంద్రకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా శుభాకాంక్షలు తెలిపారు. గుడివాడలో గెలిచిన వెనిగండ్ల రాము, పెడనలో గెలిచిన కాగిత కృష్ణప్రసాద్, పామర్రులో గెలిచిన వర్ల కుమార్ రాజాలను కూడా కలిసి దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

కంకిపాడు: పామర్రు ఎమ్మెల్యేగా గెలుపొందిన వర్ల కుమార్ రాజాను స్థానిక టీడీపీ నాయకులు పామర్రులో ఘనంగా సత్కరించారు. టీడీపీ కంకిపాడు మండల అధ్యక్షులు సుదిమళ్ల రవీంద్ర, పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకటరమణ, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్, వడ్లాది శ్రీనివాసరావు, కొడెల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● మచిలీపట్నం ఎమ్మెల్యేగా గెలుపొందిన కొల్లు రవీంద్రను పెనమలూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు సెంగెపు రంగారావు, కొణతం సుబ్రహ్మణ్యం, గోపీచంద్ తదితరులు కలిసి ఘనంగా సత్కరించారు.



తుమ్మలపల్లి హరికృష్ణను సత్కరిస్తున్న కంకిపాడు టీడీపీ నాయకులు

కంకిపాడులో టీడీపీకి
3,200 ఓట్ల మెజారిటీ

కంకిపాడు, జూన్ 6: కంకిపాడులో టీడీపీకి 3,200 ఓట్లు మెజారిటీ రావడంతో ఆ పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణను కంకిపాడు నాయకులు, గ్రామస్థులు గురువారం ఘనంగా సత్కరించారు. కంకిపాడులోని 177వ బూత్‌లో అత్యధిక మెజారిటీ రావడంతో పాటు అన్ని బూత్‌లలో భారీ మెజారిటీలు వచ్చాయని హరికృష్ణ తెలిపారు. కంకిపాడులో టీడీపీకి భారీ మెజారిటీ రావడానికి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి మరువలేనిద న్నారు. గెలుపునకు కృషి చేసిన పులి శ్రీనివాసరావు, చలవాది రాజా, గోగినేని వెంకరమణ, ఏనుగ జయప్రకాష్, గడ్డం నెహ్రూలను సత్కరించారు.

కృష్ణా

• మచిలీపట్నం • పెడన • గుడివాడ • పామర్రు • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310



నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ.4.50

వేదవ్యాస్‌కు కాగిత కృతజ్ఞతలు



మచిలీపట్నం టౌన్, జూన్ 6 : అఖండ మెజారిటీ ఇచ్చి గెలిపించిన ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయబోమని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. కాగిత కృష్ణప్రసాద్ గురువారం బూరగడ్డ వేదవ్యాస్‌ను కలిశారు. తన విజయానికి కృషి చేసిన బూరగడ్డ వేదవ్యాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



కొల్లు రవీంద్రను గజమాలతో సత్కరిస్తున్న అరిశేపల్లి టీడీపీ నాయకులు



బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న కొనకళ్ల బుల్లయ్య తదితరులు



కాగిత కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న అప్సా నాయకులు



రవీంద్ర, కొనకళ్ల, బండి రామకృష్ణలను సత్కరిస్తున్న జనసేన నాయకులు

విజేతలకు అభినందన, సత్కారం

మచిలీపట్నం టౌన్, జూన్ 6 : దేశ విదేశాల్లో రోల్డు గోల్డు నగలు మార్కెటింగ్ చేసేందుకు సహకరిస్తానని ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర అన్నారు. జ్యూయలరీ పార్కు ఆధ్వర్యంలో గురువారం కొల్లు రవీంద్రను ఘనంగా సత్కరించారు. సువర్ణ కల్యాణ మండపంలో జ్యూయలరీ పార్కు అధ్యక్షుడు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో పార్కు గౌరవాధ్యక్షుడు చలమలశెట్టి నరసింహారావు, అంకెం జితేంద్ర, అలపాటి సురేష్, జి. రామబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే కొల్లు రవీంద్రను ఫోటో, వీడియోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర నాయకులు చిలంకుర్తి శేషు, సంఘ నాయకులు సత్కరించారు.

● ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, జనసేన నేత బండి రామకృష్ణను జనసేన నాయకులు సత్కరించారు. కొల్లు రవీంద్రను బూరగడ్డ బూరగడ్డ వేదవ్యాస్ కలిసి అభినందించారు.

● రాజకీయ భీష్ముడిగా పేరు పొందిన గొర్రెపాటి గోపీచంద్ కూటమి విజయానికి అందించిన సేవలు అభినందనీయమని రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన జాతీయ అధ్యక్షుడు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. గొర్రెపాటి గోపీచంద్‌ను పలువురు ఘనంగా సత్కరించారు. బుడ్డయ్య, పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు. ● అరిసేపల్లి టీడీపీ నాయకులు రామధేని వేణు తదితరులు కొల్లు రవీంద్రను గజమాలతో సత్కరించారు. కుంచే నాని, లంకే నారాయణ ప్రసాద్, మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, అక్కుమహంతి రాజా తదితరులు కలసి అభినందనలు తెలిపారు.● **పెడన :** కాగిత కృష్ణప్రసాద్‌ను ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ప్రతినిధులు అభినందించారు. అనుమకొండ గౌరీప్రసాద్, కోలవెన్ను దిలీప్‌కుమార్, కొలుకుల నాగమోహనరావు, కట్టా ప్రభాకర్, కొమరగిరి చంద్రశేఖర్, కొమ్మారెడ్డి కిషోర్, కె.వి. జాన్ ఉన్నారు. కాగిత కృష్ణప్రసాద్‌ను శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, పార్టీ నాయకులు బొమ్మిశెట్టి వెంకన్న, రంగిశెట్టి గోవర్ధనరావు, పరసా కృష్ణ, శాయన రామారావు అభినందించారు. ●**అవనిగడ్డ :** అవనిగడ్డ ఎమ్మెల్యేగా గెలుపొందిన మండలి బుద్ధప్రసాద్‌కు పలువురు ప్రముఖులు గురువారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కల్యాణ్ పీఆర్వో ఎల్.వేణుగోపాల్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి మండలి రాజేష్, జనసేన నేతలు ఎస్.శ్రీనివాస్, తుంగల శ్రీనివాస్, సింహాద్రి పవన్, పద్యాల ప్రసాద్ తదితరులు బుద్ధప్రసాద్‌ను కలిసి అభినందనలు తెలిపారు. కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య) కలిసి శుభాకాంక్షలు బుద్ధప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, మోర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అశ్వారావుపాలెం ఎంపీటీసీ సభ్యుడు కటికల వసంత్ నేతృత్వంలో గ్రామానికి చెందిన యువత బుద్ధప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. గుడివాక శేషుబాబు, యక్కటి నాగరాజు, దాసినేని నాగరాజు, కటికల వెంకటేశ్వరరావు, రేపల్లె చందు, కటికల శివనాగులు పాల్గొన్నారు. ● **మోపిదేవి :** కప్తానుపాలెంలో డోకిపర్తి బాలకోటేశ్వరరావు ఆధ్వర్యంలో బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. మోపిదేవి లంక, వెంకటాపురం, కె.కొత్తపాలెం గ్రామాల్లో సంబరాలు జరుపుకున్నారు. జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు, నాదెళ్ల శరత్ చంద్రబాబు, మురాల సుబ్బారావు, మోర్ల జయలక్ష్మి, అత్తలూరి రమేష్, నాదెళ్ల వెంకట్రామయ్య, రావి రత్నగిరి పాల్గొన్నారు. ●**నాగాయలంక :** మండలి బుద్ధప్రసాద్‌ని గురువారం భావదేవరపల్లి, చోడవరం, పెదకమ్మవారిపాలెం, తలగడదీవి తదితర నేతలు, కార్యకర్తలు దుశ్శాలువాలను కప్పి సత్కరించారు. మండలి ఉదయభాస్కర్, మండవ బాలవర్ధిరావు పాల్గొన్నారు. ● **గుడివాడ :** వెనిగండ్ల రాము గెలుపు సందర్భంగా ధనియాలపేటలో సంబరాలను చేసుకున్నారు. సత్యనారాయణ, రామధేను వేణుబాబు, ముళ్ళపూడి రమేష్, రెడ్డి షణ్ముఖ్, టిక్కులి నాగరాజు, శివ య్యా, సూరిబాబు, హరిబాబు, దుర్గారావు, వెంకటేశ్వరరావు, లావణ్య, శారద, లీల పాల్గొన్నారు. ●**ఘంటసాల :** కూటమి అభ్యర్థులు విజయం సాధించటంతో గోగినేనిపాలెంలో కుంపటి సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను పరుచూరి సుభాష్ చంద్రబోస్, అత్తులూరి గోపిచంద్ కేక్ కట్ చేశారు. అంజయ్య, గుత్తికొండ వరప్రసాద్, దిరిశం వెంకట్రావు, బుల్లా కిషోర్, మునిపల్లి బుజ్జి, అంబటి వెంకటేశ్వరరావు, కుంపటి చిట్టిబాబు, కుంపటి చక్రవర్తి పాల్గొన్నారు. ● **పామర్రు :** జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావును గురువారం బందరులో ఎమ్మెల్యే కుమార్‌రాజా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కుమార్ రాజాకు నారాయణరావు అభినందలు తెలిపారు. ● (ప **మిడిముక్కల :** వర్ల కుమార్ రాజాను కపిలేశ్వరపురంలో తాతినేని రమేశ్ ఆధ్వర్యంలో అభినందిం చారు. రమేశ్, తాతినేని సాయిదత్తు సోదరులు, తోట్లవల్లూరు మండల నేత వీరపనేని శివరామ్, గూడపాటి గిరి, వల్లభనేని సత్యనారాయణ ,లయన్స్ క్లబ్ కార్యదర్శి తుమ్మల వెంకట గంగధరరావు కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. తాతినేని రమేశ్ ఏర్పా టు చేసిన ఆత్మీయ విందుకు ఐదు వేల మంది హాజరయ్యారు.

● **కోడూరు :** కూటమి ఘన విజయంపై కోడూరులో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. బచ్చు రాజా నివాసం వద్ద ఆయన తనయుడు బచ్చు వెంకటేష్ ఆధ్వర్యంలో భారీ బాణాసంచా కాల్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు కట్ చేశారు. పిట్టలంకలో మం డల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రె గంగయ్య నివాసం వద్ద, కోడూరు జనసేన పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు.



రవీంద్రకు ఫొటోగ్రాఫర్ల సంఘం సత్కారం



తాతినేని రమేశ్ ఆధ్వర్యంలో...



గోగినేనిపాలెంలో సంబరాలు



రవీంద్రను అభినందిస్తున్న జ్యూయలరీ పార్క్ ప్రతినిధులు

రైతాంగానికి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తా: వెనిగండ్ల

గుడివాడ : రైతాంగానికి ఇబ్బందులు తలెత్తకుండా సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జలనవరుల శాఖ అధికారులను ఆదేశించారు. వెనిగండ్లను గురువారం వివిధ శాఖ అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారితో విడి విడిగా సమావేశం నిర్వహించారు. ప్రధాన డ్రైనేజీలు, కాల్వలు, మ్యాప్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతూ అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూడాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో విలేకర్లతో మాట్లాడుతూ తనకు రాజకీయ కక్ష లంటే ఇష్టం లేదని, ప్రజలకు యిచ్చిన వాగ్ధానాలను అమలు చేయడంపైనే దృష్టిసారిస్తానన్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, దానేటి సన్యాసిరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మ్యాప్ పరిశీలిస్తున్న వెనిగండ్ల

చిరస్మరణీయుడు చండ్ర



చండ్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

చల్లపల్లి : దున్నేవాడికే భూమి నినాదంతో అనేక మంది పేద ప్రజలకు భూములు సాధించటంలో ముఖ్యభూమిక పోషించిన చండ్ర రాజేశ్వరరావు చిరస్మరణీయుడని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అన్నారు. కామ్రేడ్ రాజేశ్వరరావు 110వ జయంతి చండ్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో గురువారం జరిగింది. బెనర్జీ మాట్లాడుతూ, సంపన్న రైతు కుటుంబంలో పుట్టి సాదాసీదా జీవితం గడిపిన రాజేశ్వరరావు రైతాంగానికి, పేద ప్రజలకు ఆపద్బాంధవుడిలా సేవలందించారన్నారు. అంతటి మహోన్నత వ్యక్తి చల్లపల్లి మండలం మంగళాపురం వాసి కావటం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. పరుచూరి కోటేశ్వరరావు (రాము), రైతుసంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రాము, సీపీఐ నాయకులు మల్లుపెద్ది బోసు, కొర్రపాటి ముఖర్జీ, కోదాటి నాగయ్య, సిద్ధాబత్తుల వాసు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, కంఠంనేని జ్యోత్స్న దేవి తదితరులు పాల్గొన్నారు. తొలుత సీఆర్ చిత్రపటానికి మనుమడు (మేనల్లుని కొడుకు) రాము పూలమాలలు వేసి నివాళులర్పించారు.



విద్యార్థులకు సామాజిక విషయాలు బోధిస్తున్న రమాదేవి

రమాదేవి సేవలు స్ఫూర్తిదాయకం

అవనిగడ్డ రూరల్, జూన్ 6 : ఉపాధ్యాయులు రమాదేవి - సతీష్ దంపతులు విద్యార్థులకు స్ఫూర్తిదాయక సేవలందిస్తున్నారని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు దాలిపర్తి కృష్ణమూర్తి, లక్ష్మీ నరసమ్మ, సీపీఐ సీనియర్ నాయకులు మోదుమూడి రామారావు, అరుణకుమారి దంపతులు పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా సామాజిక పరిస్థితులపై అవగాహన కల్పిస్తూ విద్యా సేవలందిస్తున్న వారిని పలువురు ప్రముఖులు అభినందించారు. నాల్గవ తరగతి నుంచి ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పాఠ్యాంశాలు బోధిస్తూ సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడం ముదావహమన్నారు.

ముడా ఛైర్‌పర్సన్ రాజీనామా

మచిలీపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ఛైర్‌పర్సన్ బీవీకేడీ నాగలక్ష్మీభవానీ గురువారం తన పదవికి రాజీనామా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండు పర్యాయాలు ఆమె ముడా ఛైర్‌పర్సన్‌గా పనిచేశారు ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలవడంతో ముందస్తుగానే ఆమె తన పదవికి రాజీనామా చేశారు.

మృతుడి కుటుంబానికి కొడాలి పరామర్శ

గుడివాడ రూరల్ : ఎన్నికల ఫలితాలు చూసి వైసీపీ కార్యకర్తలు, అభిమానులు ఎవ్వరూ అధైర్యపడవద్దని మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని పిలుపునిచ్చారు. కొడాలి నాని ఓటమిని తట్టుకోలేక సైదేపూడిలో ఆత్మహత్య చేసుకున్న పిట్ట అనిల్ కుటుంబసభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. రూ.5 లక్షల ఆర్థిక సాయమందించారు. భవిష్యత్తులో వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

కమిషనర్ పారిశుధ్య పనుల పరిశీలన

పెడన : డ్రెయిన్లలో మురుగునీటి పారుదల సజావుగా జరిగేందుకు కమిషనర్ బి. వెంకటరామయ్య చర్యలు చేపట్టారు. డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా పేరుకుపోవడంతో మురుగునీటి ప్రవాహం సాఫీగా జరగడం లేదు. ఫలితంగా వర్షాలకు డ్రెయిన్లు పొంగి మురుగునీరు రోడ్లమీద ప్రవహిస్తోంది. కమిషనర్ డ్రెయిన్లలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తమ సిబ్బందితో తొలగింపచేస్తున్నారు.

ఘనంగా రాజశేఖరస్వామి కల్యాణం

అవనిగడ్డ : అవనిగడ్డలో రాజశేఖర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాస్ నేతృత్వంలో వేద పండితులు జంజ్యాల రామసుబ్బయ్య శర్మ, పవన్ సంతోష్ శర్మ స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. గురువారం ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా రామేశ్వరస్వామి కల్యాణం

మోపిదేవి : టేకుపల్లిలో కంచి కామకోటిపీఠం ఆధ్వర్యంలో బాలపార్వతీ సమేత రామేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ కార్యదర్శి యడవల్లి నీల లోహిత శర్మ దంపతులు కల్యాణాన్ని జరిపారు. భక్తులు కల్యాణ మహోత్సవాన్ని తిలకించి తరించారు.

గూడూరులో కథల పోటీలు

మచిలీపట్నం టౌన్ : గూడూరు శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి నగేష్ బహుమతులు అందించనున్నట్టు గ్రంథాలయ నిర్వాహకుడు సుబ్బారావు తెలిపారు.

అందరికీ కృతజ్ఞతలు : ఆర్వో శ్రీదేవి

పామర్రు : సార్వత్రిక ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, రాజకీయపార్టీలు, అన్ని వర్గాల ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని పామర్రు నియోజకర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీదేవి అన్నారు. తన కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పోలింగ్, కౌంటింగ్ పక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు దోహదపడిన అధికారులు, రాజకీయ పార్టీల నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్న పోలీస్ శాఖ, పాత్రికేయులు అందించిన సేవలను ప్రశంసించారు.. ఎంపీ, బాలశౌరి, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు ఆమె అభినందనలు తెలియజేశారు.

ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు

కూచిపూడి : గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. పుస్తక పఠనం, ఇంగ్లీష్, తెలుగులో కథలు నేర్పించటం, రాయించటం, వ్యాసరచన, వక్తృత్వం, ఆటపాలటతో మేధస్సుకు పదును పెట్టే అనేక అంశాల్లో పోటీలు నిర్వహించారు. మొవ్వ గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు అందించనున్నట్లు గ్రంథాలయాధికారిణి కృష్ణకుమారి తెలిపారు.

చేనేత వృద్ధులకు నిత్యావసర సరుకుల వితరణ

పెడన రూరల్ : ఆకలితో పస్తులుండే వారికి పట్టెడన్నంజీవితాన్ని నిలుపుతుందని పెడన ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రేరియన్ పేరిశెట్టి నాగరవి అన్నారు. గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో చేనేత వృద్ధులు, అనారోగ్యంతొ బాధపడుతున్న వారికి వారికి ఎనిమిది వేల రూపాయలు విలువగల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. హైదరాబాదుకు చెందిన పిచ్చుక వేణు గోపాలరావు తల్లి దుర్గా నాగేశ్వరి పుణ్యతిథి సందర్భంగా వీటిని అందించారు. పూట గడవని వారికి సాయం చేయటం మనందరి బాధ్యతగా గుర్తించి ఆదుకోవాలని వేణు అన్నారు.

చల్లపల్లి మండలంలో బుద్ధప్రసాద్‌కు 7,117 ఓట్ల మెజార్టీ

చల్లపల్లి : ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన డాక్టర్ మండలి బుద్ధప్రసాద్‌కు చల్లపల్లి మండలంలో 7,117 ఓట్ల భారీ మెజారిటీ లభించింది. టీడీపీకి కంచుకోటగా ఉన్న చల్లపల్లి మండలంలో జనసేన తోడవటంతో అత్యధిక మెజారిటీ వచ్చింది. చల్లపల్లి పట్టణంలో 3510 ఓట్ల ఆధిక్యం రాగా, లక్ష్మీపురంలో 1554 ఓట్లు, మాజేరులో 539 ఓట్లు, పాగోలులో 542 ఓట్లు, వక్కలగడ్డలో 361 ఓట్లు, యార్లగడ్డలో 160 ఓట్లు, పురిటిగడ్డలో 126 ఓట్లు, నడకుదురులో 143 ఓట్లు, ఆముదార్లంకలో 91 ఓట్లు, వెలివోలులో 187 ఓట్ల చొప్పున ఆధిక్యత లభించింది. ఒక్క మంగళాపురం గ్రామంలో మాత్రమే వైసీపీకి 96 ఓట్ల ఆధిక్యత లభించింది. మండలంలో మండలి బుద్ధప్రసాద్‌కు భారీ మెజార్టీ లభించటంతో కూటమి నేతలు, కార్యకర్తలు మంచి జోష్‌లో ఉన్నారు.

నాగాయలంక మండలంలో 7,957 ఓట్ల మెజార్టీ

నాగాయలంక : మండలంలో జనసేన పార్టీ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌కి 7,957 ఓట్ల మెజారిటీ వచ్చింది. మండలంలో మొత్తం 34,472 ఓట్లు ఉండగా, 34,095 ఓట్లు పోలయ్యాయి. మండలంలో 49 పోలింగ్ బూత్‌లలో ఐదు బూత్‌లు తప్ప మిగిలిన 44 బూత్‌లలో వైసీపీ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు మండలి బుద్ధప్రసాద్‌కే అత్యధిక ఓట్లు వచ్చాయి. నంగేగడ్డ, సొర్లగొంది, చోడవరం, పెదపాలెం, ఈలచెట్లదిబ్బ బూత్‌లో గ్లాసు కన్న ఫ్యాన్‌కి స్వల్పంగా ఓట్లు పడ్డాయి. తలగడదీవిలో కాపు యువత బాగా కృషి చేయటంతో ఫ్యాన్ కంటే గాజుగ్లాసుకి 35 ఓట్లు ఆధిక్యత వచ్చినట్లు మండల శ్రీ కృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్ తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు జరపొద్దు

మచిలీపట్నం టౌన్ : స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయి హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే కేంద్రాలపై చర్యలు తీసుకుంటామన్నారు.